



EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
29 ఏప్రిల్ 2024
పేజీలు: 02

## ఆగిఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్..
### ముగ్గురు చిన్నారులు సహా 9 మంది మృతి



ఛత్తీస్‌గఢ్‌లోని బెమెతరా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున జిల్లాలోని కతియా వద్ద ఆగి ఉన్న లారీని ఓ మినీ వ్యాన్ ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది మరణించారు. మరో 23 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. మృతుల్లో నలుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు బెమెతరా జిల్లా కలెక్టర్ రణ్‌వీర్ శర్మ చెప్పారు. గాయపడినవారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని, వారిని మెరుగైన చికిత్స కోసం ఎయిమ్స్ రాయ్‌పూర్‌కి తరలించామని వెల్లడించారు. బాధితులంతా ఓ శుభాకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగిందన్నారు.



## రేపు ఉదయం 11 గంటలకు పదో తరగతి ఫలితాలు

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల ఫలితాల విడుదలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 30న ఉదయం 11 గంటలకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేయనున్నారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ https://results.bsetelangana.org/ చూసుకోవచ్చు. ఈ ఏడాది మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు దాదాపు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 2,57,952 మంది బాలురు, 2,50,433 మంది బాలికలు ఉన్నారు. పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియను ఏప్రిల్ 13 నాటికి పూర్తిచేశారు.

# సిబ్బంది ఉన్నా ఇంటింటికీ పింఛన్లు ఎందుకివ్వరు?

### టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు



ఏపీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పెన్షన్ల పంపిణీలో వైసీపీ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారయంత్రాంగం ప్రభుత్వానిక వత్తాసు పలుకుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ మోచేతి నీళ్లు తాగే కొందరు అధికారులు కుట్రలు, కుతంత్రాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ తీరుతో గత నెలలో 33 మంది వృద్ధులు ప్రాణాలు కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ హత్యల్లో కొందరు అధికారులు భాగస్వాములయ్యారని మండిపడ్డారు. ఒక పార్టీ ప్రలోభాల కోసం అధికారులు పనిచేయడం తప్ప అని చంద్రబాబు ఖండించారు. ఇంటి వద్ద పెన్షన్లు పంపిణీ చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పంచాయతీ పరిధిలో ఒక్కో ఉద్యోగి 45 మందికి మాత్రమే పెన్షన్ ఇస్తాడన్నారు. పంచాయతీ ఆఫీసుల్లో ఇచ్చేదే ఇంటి వద్ద ఇస్తారు. ఇందులో తప్పేముంది? అని చంద్రబాబు ప్రశ్నించారు. పెన్షన్ల నగదును బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామంటున్నారని, అయితే పెన్షన్ తీసుకునే అందరి దగ్గర ఫోన్లు ఉండవు కదా అని చంద్రబాబు ప్రశ్నించారు. బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ అయ్యిందో లేదో ఎలా తెలుస్తుందని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామంటూ మరో కొత్త డ్రామాకు తెరదించామని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రభుత్వ యంత్రాంగం ఎంతో ప్రమాదకరమని, ఎన్నికల సంఘం కూడా చాలా అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగాలని ఆకాంక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత అన్ని పార్టీలు ఒకటేనని, అన్ని పార్టీలకు సమాన అవకాశాలు ఉంటాయని చంద్రబాబు ప్రస్తావించారు. "ముఖ్యమంత్రి ఒక్కడే ప్రభుత్వాన్ని యంత్రాంగాన్ని వాడుకోవచ్చు. బస్సులు వాడుకోవచ్చు. గ్రౌండ్ వాడుకోవచ్చు అంటే కుదరదు. సభలకు బెదిరించి ఎక్కువమందిని తీసుకురావొచ్చని అనుకుంటున్నారు. ఇవన్నీ జరగడానికి వీల్లేదు" అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.



## వైఎస్సార్‌కు, జగన్‌కు పోలికే లేదు

సీఎం జగన్‌పై ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల ఘాటైన వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్ పాలనకు, జగన్ పాలనకు పోలికే లేదని అన్నారు. వైఎస్ ఎప్పుడూ ప్రజల్లోనే ఉండేవారని, జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజలతో ఎన్నడూ మమేకం కాలేదని అన్నారు. జగన్ పాలనలో మంత్రులకే అపాయింట్మెంట్ దొరకడం లేదని, ఇక సామాన్యులకు జగన్ అందుబాటులోనే లేరని మండిపడ్డారు.



## టైటానిక్ వాచ్ కు వేలంలో భారీ ధర..

ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలో 1912లో మునిగిపోయిన టైటానిక్ నౌకకు సంబంధించిన కథలు ఇంకా వినిపిస్తున్నాయి. అప్పటి ప్రమాదంలో మరణించిన అత్యంత సంపన్న వ్యాపారవేత్త జాన్ జాకబ్ ఆస్టర్ (47) వినియోగించిన గోల్డ్ పాకెట్ వాచ్ సరికొత్త రికార్డు సృష్టించింది. అమెరికాలోని హెన్రీ ఆల్డ్రిడ్జ్ అండ్ సన్ వేలం సంస్థ నిర్వహించిన వేలంలో ఈ వాచ్ కు భారీ ధర పలికింది. ఏకంగా ఓ వ్యక్తి దీనిని రూ.12.17 కోట్లకు సొంతం చేసుకున్నారు.



## జైల్లో కేజ్రీవాల్‌ను చూసేందుకు భార్యకు అనుమతి నిరాకరణ..!

మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తిహార్ జైల్లో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. సోమవారం ఆయనను కలిసి మాట్లాడేందుకు సీఎం సతీమణి సునీత అనుమతి కోరారు. అయితే ఇందుకు అధికారులు అంగీకరించలేదని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే ఆప్ నేత ఆతిశీకి అనుమతినిచ్చిన నేపథ్యంలో సునీత అభ్యర్థనను తిరస్కరించామని జైలు అధికారులు చెప్పారని సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఢిల్లీ మంత్రి ఆతిశీ సోమవారం సీఎంతో మాట్లాడనున్నారు. ఇక, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మంగళవారం తిహార్ జైలుకు వెళ్లి కేజ్రీవాల్‌ను కలవనున్నారు. దీంతో మంగళవారం తర్వాతే సునీతను అనుమతించనున్నట్లు జైలు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. అయితే, నిబంధనల ప్రకారం వారంలో రెండుసార్లు మాత్రమే ములాఖత్‌కు అనుమతి ఉంది. దీంతో భర్తను చూసేందుకు సునీతకు వచ్చేవారమే అనుమతి లభించనుంది.




## మే నెలలో 12 రోజులు బ్యాంకులు బంద్

మే నెలకు సంబంధించిన బ్యాంక్ సెలవులను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. దేశవ్యాప్తంగా మే నెలలో బ్యాంకులకు 12 రోజులు సెలవులు వచ్చాయి. వీటిలో రెండో, నాలుగో శనివారాలు, ఆదివారాలతో పాటు పండుగలు, ప్రత్యేక సందర్భాలు కలిసి ఉన్నాయి. ఇవి రాష్ట్రాలను బట్టి మారే అవకాశం ఉంది. ఆర్థిక లావాదేవీలు నిర్వహించే వారు ఏదో ఒక పని కోసం బ్యాంకులకు వెళ్లాల్సి వస్తుంది.




## ప్రచారంలో దూసుకెళ్తున్న స్మృతి ఇరానీ

ఉత్తరప్రదేశ్‌లోని అమేథి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థి స్మృతి ఇరానీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై గెలుపొందిన ఆమె.. ఈ ఎన్నికల్లో కూడా ఇక్కడి నుంచే బరిలోకి దిగారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి తన నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలతో కలిసి స్కూటర్ రైడ్‌కు వెళ్లారు. చీర కట్టులో హెల్మెట్ ధరించి నియోజకవర్గ ప్రజలను కలుసుకున్నారు. వారితో సెల్ఫీలు, ఫొటోలకు ఫోజులిచ్చారు. ఈసారి కూడా తనకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.



## రంగంలోకి బైడెన్.. గాజాలోకి మరింత సాయం

ఇజ్రాయెల్ దాడులతో అతలాకుతలమైన గాజాలోకి మరింత సహాయ సామగ్రిని చేర్చే దిశగా అమెరికా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు అధ్యక్షుడు బైడెన్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఆదివారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఆహార పదార్థాలు, నిత్యావసరాలు సహా ఇతర సహాయ సామగ్రిని అనుమతించేందుకు మరిన్ని దారులను తెరుస్తామని నెతన్యాహు హామీ ఇచ్చారు. ఈవారంలోనే ఆ దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హమాస్ దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ చేపట్టిన యుద్ధంతో గాజాలో తీవ్ర క్షామం నెలకొంది. సామాన్య ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఈ నేపథ్యంలో అక్కడికి మానవతా సాయాన్ని అనుమతించాలని ప్రపంచ దేశాలు ఒత్తిడి పెంచాయి. దీంతో ఉత్తర సరిహద్దుల్లో మరికొన్ని దారులను తెరవడానికి ఇజ్రాయెల్ అంగీకరించింది.



## మూడేళ్లలో అపోలో హాస్పిటల్స్ రూ.3,000 కోట్ల పెట్టుబడులు!

వచ్చే మూడేళ్లలో రూ.3,000 కోట్ల పెట్టుబడులకు అపోలో హాస్పిటల్స్ సన్నాహాలు చేస్తోంది. అమెరికాకు చెందిన దిగ్గజ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్తో ఒప్పందం ఫలితంగా, వస్తున్న నిధులకు మరికొంత జతచేసి, సంస్థ విస్తరణ కార్యకలాపాలపై పెట్టుబడి పెట్టాలని అపోలో నిర్ణయించింది. అపోలో హెల్త్ కోలో రూ.2475 కోట్ల ఈక్విటీ పెట్టుబడులను అడ్వెంట్ రాబోయే రెండున్నరేళ్ల కాల వ్యవధిలో పెట్టనుంది.



## 30 ఏళ్లు దాటాకే పెళ్లి..

'జాతి రత్నాలు' సినిమాతో ఫరియా అబ్దుల్లా హీరోయిన్ గా హిట్ అందుకుంది. ప్రస్తుతం అల్లరి నరేష్ హీరోగా ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా రాబోతున్న సినిమా 'ఆ ఒక్కటీ అడక్కు'. ఫరియా అబ్దుల్లా ఈ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఫరియా అబ్దుల్లా తన పెళ్లి పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. నా పెళ్లి విషయంలో నాకు అంటూ కొన్ని స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయని ఫరియా అబ్దుల్లా చెప్పింది. ఫరియా అబ్దుల్లా ఇంకా మాట్లాడుతూ.. 'నేను 30 ఏళ్లు దాటాకే నా పెళ్లి గురించి ఆలోచిస్తాను. అయితే, కచ్చితంగా నేను ప్రేమ వివాహమే చేసుకుంటాను. నా మనసులోని మాటను నేను ఇలా ఓపెన్ గా చెప్పాను' అంటూ ఫరియా అబ్దుల్లా చెప్పింది. ఇక ఆమె నటించిన 'ఆ ఒక్కటీ.. అడక్కు' సినిమా మే 3న థియేటర్లలోకి రానుంది. మరి ఈ సినిమా ఏ రేంజ్ హిట్ అవుతుందో చూడాలి.

## ఐపీఎల్‌లో 500కు పైగా రన్స్..

### కోహ్లీ ఖాతాలో మరో అరుదైన రికార్డు



ఐపీఎల్ 2024 సీజన్ లో ఆర్సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పరుగుల వరద పారిస్తున్నాడు. తాజాగా ఆదివారం (ఏప్రిల్ 28) గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో కేవలం 44 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్ల సహాయంగా అజేయంగా 70 పరుగులు చేశాడు. తద్వారా ఆర్సీబీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతేకాదు ఈ రన్స్ తో మరికొన్ని రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడీ రన్ మెషిన్. అదేంటంటే.. గుజరాత్ టైటాన్స్‌పై 70 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ ఈ ఐపీఎల్ సీజన్‌లో 500 పరుగులు పూర్తి చేశాడు. దీంతో ఆరెంజ్ క్యాప్ రేసులో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ సీజన్‌లో 10 మ్యాచ్‌లు ఆడిన విరాట్ కోహ్లీ 500 పరుగుల మార్క్‌ను దాటాడు. దీంతో ఐపీఎల్‌లో అత్యధిక సార్లు 500 పరుగుల మార్క్‌ను దాటిన రెండో ఆటగాడిగా నిలిచాడు. ఇప్పటి వరకు జరిగిన 17 ఎడిషన్లలో విరాట్ కోహ్లీ 7 సీజన్లలో 500 పరుగుల మార్కును దాటాడు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## చికెన్ షావర్మా తిని..
# 12 మందికి అస్వస్థత

ధుల్లో అమ్ముతున్న చికెన్ షావర్మా తిని సుమారు 12 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన మహారాష్ట్ర రాజధాని ముంబైలో చోటు చేసుకుంది. బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. తూర్పు గోరేగావ్ ప్రాంతంలోని సంతోష్ నగర్‌లో శాటిలైట్ టవర్ వద్ద చికెన్ షావర్మా తిని రెండు రోజుల వ్యవధిలో 12 మంది అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. అందులో తొమ్మిది మంది కోలుకొని డిశ్చార్జ్ కాగా, మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫుడ్ పాయిజనింగ్ కారణంగానే వీరు అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది.



## లాభాలతో ప్రారంభమైన
# స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు మన సూచీలకు దన్నుగా నిలుస్తున్నాయి. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 329 పాయింట్ల లాభంతో 74,059 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 85 పాయింట్లు పెరిగి 22,505 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.39 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్, ఎం అండ్ ఎం, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు మాత్రమే నష్టాల్లో ఉన్నాయి. టెక్ మహీంద్రా, మారుతీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అల్ట్రా టెక్ సిమెంట్, టాటా స్టీల్, సన్ ఫార్మా, టీసీఎస్, ఎల్ అండ్ టీ, నెస్లే ఇండియా, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి.

## ప్రచారానికి దూరంగా
# బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

ఆయన ఎవరి మాట వినరు.. ఆయన మాట పార్టీ వినదు. అందుకేనేమో ఆయన కొద్ది కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కనీసం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోనూ పాల్గొనడం లేదు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలంటూ కొద్దిమంది నేతలు ఆయనకు చెప్పినా అబ్బే... నా దారి ఇంతే అంటున్నారు. ఆయన ఎవరో కాదు... గోషామహల్ భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్.



కంటిలో నలుసులా..
పార్టీ సీనియర్ నేతల మాటల్లో చెప్పాలంటే రాజాసింగ్ భాజపాకు కంటిలో నలుసులా మారారు. ఈ ఎమ్మెల్యే వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజధానిలో ఒకప్పుడు మాజీ ఎంపీ ఆలె నరేంద్ర హిందుత్వానికి ప్రతినిధిగా ఉండేవారు. ఆయన చనిపోయిన తరువాత ఆ స్థానాన్ని రాజాసింగ్ భర్తీ చేశారనే చెప్పొచ్చు. రాజధానిలో కొన్నిసార్లు భాజపా పరువును నిలబెట్టిందీ ఆయనే. 2018, 23 ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలోని మొత్తం 29 శాసనసభ స్థానాల్లో ఆయనొక్కరే కమలం పార్టీ నుంచి గెలిచారు. అలాంటి వ్యక్తి ప్రస్తుతం పార్టీలోని కొద్దిమంది సీనియర్ల వైఖరిపై మండిపడుతున్నారు. సుమారు రెండు నెలలుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ సహాయ నిరాకరణ చేస్తున్నారు.

కీలక సమయంలో..
కీలకమైన లోక్‌సభ ఎన్నికల సమయంలో సొంత నియోజకవర్గం గోషామహల్ పరిధిలోనూ ఆ పార్టీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా ఇప్పటివరకు ప్రచారం చేయలేదు. ప్రధానంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆయనకు మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే పరిస్థితి కనిపిస్తోంది. పార్టీ పరంగా కొన్ని నిర్ణయాలు ముందుగా తనకు చెప్పడం లేదని ఆగ్రహంతో రగిలిపోతున్నారు. 2018లో ఆయనొక్కరే భాజపా తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో శాసనసభ పక్షనేతగా ఉన్నారు. మధ్యలో జరిగిన ఉప ఎన్నికల్లో ఈటల రాజేందర్, రఘునందన్‌రావు గెలిచినా ఆయనే కొనసాగారు. మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో నగరం నుంచి రాజాసింగ్‌తో పాటు రాష్ట్రంలో ఎనిమిది మంది విజయం సాధించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనకు మరోసారి భాజపా శాసనసభ పక్షనేతగా ఇవ్వాలని కోరినా పార్టీ అంగీకరించలేదు. భాష మీద పట్టుతో పాటు ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానం ఆ అవకాశాన్ని ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి ఇచ్చింది. మిగిలిన కొన్ని పదవులను ఇతరులకు ఇచ్చారు. హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా మాధవీలతను ఎంపిక చేసినపుడూ ఆయనకు ముందుగా సమాచారం ఇవ్వలేదని చెబుతున్నారు. ఇతర అభ్యర్థుల విషయంలోనూ అతని అభిప్రాయం తీసుకోలేదు. ఈ కారణంగా రాష్ట్ర పార్టీలోని కొందరు అగ్రనేతలపై మండిపడుతున్నారు.

దూరం పెడుతున్నారని...
ఇటీవల హైదరాబాద్‌కు అమిత్‌షాతో పాటు ఇతర పార్టీ పెద్దలు వచ్చినా ఆయన వారిని కలవలేదు. ముఖ్యంగా కిషన్‌రెడ్డి పేరు చెబితేనే రాజాసింగ్ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. తనను పార్టీ నుంచి దూరం చేయడానికి ఆయనతో పాటు మరికొందరు ప్రయత్నిస్తున్నారనే అసంతృప్తితో ఉన్నారని అతని అనుచరులు చెబుతున్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు

బీఆర్‌ఎస్‌కు మరో షాక్ తగిలింది. తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్‌ను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో అమిత్‌రెడ్డి కలిశారు.



## రేపు ఎన్డీయే ఉమ్మడి
# మేనిఫెస్టో విడుదల

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఉమ్మడి మేనిఫెస్టోను ఎన్డీఏ కూటమి రేపు విడుదల చేయనుంది. వైసీపీ మేనిఫెస్టో ఇప్పటికే విడుదలైంది. టీడీపీ సూపర్ సిక్స్, జనసేన షణ్ముఖ వ్యూహం పేర్లతో చూచాయగా తమ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాయి. ప్రధానంగా పెన్షన్ పై కూటమి దృష్టి పెడుతున్నట్లు సమాచారం. క్రమంగా పెన్షన్ ను పెంచుకుంటూ వెళ్తామని వైసీపీ అంటుండగా....తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ. 4వేల పెన్షన్ ఇస్తామని కూటమి హామీ ఇస్తోంది. కాగా,జనసేన తరపున మెగాస్టార్ చిరంజీవి ప్రచారం చేయనున్నారు. ఈ విషయాన్ని ఆ పార్టీ నేత యాక్టర్ పృథ్వీ వెల్లడించారు. మే 5 నుంచి 11 వరకు జనసేన తరఫున ఎన్నికల ప్రచారంలో చిరంజీవి పాల్గొంటారని తెలిపారు. కూటమి అభ్యర్థులు గెలవాలని షూటింగ్ పక్కన పెట్టి ప్రచారం చేస్తారన్నారు. ఇప్పటికే మెగాస్టార్ కూటమి అభ్యర్థులకు మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే.



## టెక్ హబ్‌ను ట్యాంకర్ హబ్‌గా మార్చిన కాంగ్రెస్ : ప్రధాని మోదీ

కర్నాటకలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నడపడం లేదని దోపిడీ ముఠాను నడుపుతోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ సోమవారం బాగల్కోట్‌లో ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. టెక్ హబ్‌గా పేరొంది ప్రపంచంలోనే తనదైన ముద్ర వేసిన కర్నాటకను కాంగ్రెస్ ప్రభుత్వం ట్యాంకర్ హబ్‌గా మార్చిందని ఎద్దేవా చేశారు. 2జీ స్కామ్ తరహాలో కుంభకోణాలకు పాల్పడి జేబులు నింపుకోవాలని కాంగ్రెస్ పాలకులు కలలు కంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ దోచుకోవడం మినహా రాష్ట్ర ప్రజల మేలు కోసం చేసిందేమీ లేదని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితిలోకి కర్నాటక కాంగ్రెస్ సర్కార్ జారుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



## ఇద్దరు పిల్లలకు ఉరేసి తల్లి ఆత్మహత్య

ఆ తల్లికి ఏ కష్టమొచ్చిందో తెలియదు పాపం. నవ మాసాలు మోసి.. పెంచి పెద్ద చేసిన ఆ మాతృమూర్తే తన చేతులతో కన్నబిడ్డల ఉసురు తీసింది. కంటికి రెప్పలా కాపాడిల్సిన కన్నతల్లే వారిపాలిట ఉరితాడై ప్రాణాలు తీసింది. ఈ హృదయవిదాకర సంఘటన వైఎస్సార్ జిల్లాలోని వల్లూరు సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చెన్నూరు గ్రామాని చెందిన ఓ మహిళ వల్లూరు సమీపంలోని పంటపొలాల్లోని ఓ చెట్టుకు తన ఇద్దరు పిల్లలకు ఉరివేసి ఆపై తను బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన స్థానికులు పోలీసులు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భార్య,భర్తల మధ్య గొడవ తలెత్తడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఓకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెదండంతో చెన్నూరులో విషాదం నెలకొంది.




## మజ్జిగతో బోలెడు ప్రయోజనాలు..

చాలా మందికి మజ్జిగ అంటే నచ్చదు. నాకొద్దు ప్లీజ్ అంటుంటారు. కానీ.. మజ్జిగతో కలిగే ప్రయోజనాలు తెలిస్తే.. ఇష్టం లేని వారు సైతం దాన్ని తప్పక తాగుతారు. మజ్జిగ మూడు దోషాలను తగ్గిస్తుంది. మజ్జిగను సైంధవ లవణంతో కలిపి తీసుకుంటే వాతాన్ని తగ్గిస్తుంది. పటిక బెల్లంతో కలిపి తీసుకుంటే పైత్యం తగ్గుతుంది. మజ్జిగకు శొంఠి, పిప్పళ్లు, మిరియాల చూర్ణం కలిపి తీసుకుంటే కఫం తగ్గుతుంది. శరీరంలో అజీర్తి, అసిడిటీ మస్యలను తగ్గించి, రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

## స్పిరిట్‌లో కియారా, నయన్?

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా యానిమల్ సినిమాతో సాలిడ్ హిట్ కొట్టాడు. దీంతో పాన్ ఇండియా దర్శకుడిగా సందీప్ రెడ్డికి బలమైన మార్కెట్ క్రియేట్ అయ్యింది. ఐతే, ఈ దర్శకుడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' అనే సినిమా రాబోతుంది. ఈ సినిమా స్క్రిప్ట్ పనుల్లో సందీప్ బిజీగా ఉన్నారు. ఈ సినిమా డిసెంబర్ నుంచి పట్టాలెక్కనుంది. ఐతే, తాజాగా ఈ సినిమాకి సంబంధించి మరో క్రేజీ న్యూస్ వినిపిస్తోంది. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీ నటిస్తోందని తెలుస్తోంది. మరి, కియారా అద్వానీ, నిజంగానే ప్రభాస్ సరసన నటిస్తే.. ఆ క్రేజే వేరు. అలాగే, ఈ సినిమాలో మరో హీరోయిన్ కి కూడా స్కోప్ ఉందని.. ఆ పాత్రలో నయనతార ను తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలుస్తోంది.






## నాగచైతన్య తండేల్‌కు
# సూపర్ క్రేజ్

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా ప్రాజెక్ట్ తండేల్. చందూ మొండేటి దర్శకత్వంలో ఎన్‌సీ23 ప్రాజెక్టుగా తెరకెక్కుతోంది. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో కోలీవుడ్ భామ సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. తండేల్ నుంచి లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో చైతూ మత్స్యకారుడిగా మాస్ లుక్‌లో కనిపిస్తూ క్యూరియాసిటీతోపాటు అంచనాలు అమాంతం పెంచేస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. తండేల్ డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. తాజా సమాచారం ప్రకారం తండేలా స్ట్రీమింగ్ రైట్స్‌కు రూ.40 కోట్లకు సొంతం చేసుకున్నారు. ఇది చైతూ ఓటీటీ కెరీర్‌లోనే అత్యధికం కావడం విశేషం. తండేల్‌లో సాయిపల్లవి పోషిస్తున్న సత్య పాత్ర ఇంట్రడక్షన్ వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీలో సాయిపల్లవి కథానుగుణంగా శ్రీకాకుళం అమ్మాయిగా కనిపించనుంది.